క్లుప్తంగా

త్వరలో బెల్కటూర్‌లో పర్యటిస్తా

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



స్పీకర్‌ను కలిసిన బెల్కటూర్ గ్రామస్తులు

తాండూరు రూరల్: త్వరలో నేనే పుట్టి పెరిగిన గ్రామం బెల్కటూర్‌లో పర్యటిస్తానని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం తాండూరు మండలం బెల్కటూర్ గ్రామానికి చెందిన కొందరు హైదరాబాద్‌లో స్పీకర్ నివాసంలో ఆయనను కలిశారు. బెల్కటూర్ గ్రామస్తుల యోగక్షేమాలపై స్పీకర్ ఆరా తీశారు. బెల్కటూర్‌లో పర్యాటించి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని స్పీకర్ చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. స్పీకర్‌ను కలిసిన వారిలో తెలంగాణ ఫుడ్స్ ఆఫ్ హైదరాబాద్ మేనేజర్ మామిడిగళ్ల వెంకటయ్య, గ్రామస్తులు వెంకటేశ్, విజయ్, అమృతప్పలు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దోమ: పేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని బాసపల్లి మాజీ సర్పంచ్ అనంతయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బాసపల్లి గ్రామంలో మైసపైదయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్థానిక నేతలతో మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేందుకు ముందుకు సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు వెంకటయ్య, గ్రామస్తులు మైససత్యం, వెంకటయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొడంగల్: పదోవ తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పది వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు టాపర్లుగా నిలవాలని కోరారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మురళీధర్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

కొడంగల్: మండల పరిధిలోని అంగడిరాయిచూర్, లక్ష్మీపల్లి గ్రామాలకు చెందిన భక్తులు తిరుమల తిరుపతి దేవస్థానానికి మంగళవారం పాదయాత్రగా బయలుదేరారు. సకాలంలో వర్షాలు కురువాలని, జీవ హింస తగ్గాలని, దేశం సస్యశ్యామలంగా ఉండాలని హైందవ ధర్మ ప్రచారం చేస్తూ ఊరూరా గోవింద నామ స్మరణ చేస్తూ శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి శిష్యులు మండలం నుంచి బయలుదేరారు. చిన జీయర్ స్వామి ఆదేశాల మేరకు గత ఏడాది పాదయాత్రగా తిరుమలకు వెళ్లి వచ్చారు. ఈ ఏడాది రెండోసారి బయలుదేరారు.

మంచినీటి సమస్య రావద్దు

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్



వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలో మంచినీటి సమస్య రాన్వికుండా చూసుకోవాలని చైర్‌పర్సన్ మంజుల మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. మున్సిపల్‌లోని 34 వార్డుల్లో ఎక్కడా కూడా మంచినీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి సమస్య ఉన్న చోట స్థానిక కౌన్సిలర్లతో చర్చించి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పట్టణంలో ఎక్కడ మంచినీటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత మూడు రోజులుగా మున్సిపల్ పరిధిలో పర్యటిస్తూ మంచినీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజావైద్యం దయనీయం



మోమిన్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ముగ్గురు ఉండాల్సిన చోట ఒకే డాక్టర్

- వైద్యం అందక మండల ప్రజల ఇబ్బందులు
- తగ్గిన కాన్పులు.. పెరిగిన సిజేరియన్లు

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు డాక్టర్లు ఉండాల్సి ఉన్నా .. కేవలం ఒకరిని మాత్రమే నియమిస్తున్నారు. ప్రభుత్వం ముగ్గురు డాక్టర్లను ఎందుకు నియమించడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఇదే తంతు నడుస్తోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్ల ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్యులు లేక వైద్యం అందడం లేదని వాపోతున్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం పూర్తిస్థాయిలో వైద్యులు ఉండటంతో ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండి, ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కాన్పుల సంఖ్య కూడా పెరిగింది. జిల్లాలోనే ఆస్పత్రి రెండవ స్థానంలో నిలిచింది. గతంతో రోజుకు బయట రోగులు 350 నుంచి 400వరకు వస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. కాన్పుల సంఖ్య ఐదారు నుంచి 25 దాటుతున్నాయంటే ఆస్పత్రిలో డాక్టర్ల ప్రాధాన్యం ఎంత ఉందో ఇట్టే తెలిసిపోతుంది. ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉన్నా కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారు. దీంతో గత ఫిబ్రవరిలో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 55 మంది గర్భిణీలు కాన్పులు చేయించుకోవాల్సి ఉన్నా కేవలం నలుగురు మాత్రమే ఇక్కడి ఆస్పత్రిలో కాన్పులు చేయించుకున్నారు. 16 మంది ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా 14 మందికి సిజేరియన్ ఆపరేషన్లు జరిగాయి. మిగతా 35 మంది ఇతర జిల్లాలకు వెళ్లగా అందులో 8 మంది సిజేరియన్ ఆపరేషన్ చేసుకొన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గతంలో రోజుకు 300 మందికి పైగా రోగులు వచ్చేవారు.. నేడు 100మందికి మించడం లేదు. పూర్తిస్థాయిలో వైద్యులను నియమిస్తేనే మండల ప్రజలకు వైద్యం సక్రమంగా అందుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముగ్గురి స్థానంలో కనీసం ఇద్దరు ఉన్నా వైద్యం అందుతుందని వారు పేర్కొంటున్నారు. ఒకరు ఉండటం వల్ల ప్రైవేటును ఆశ్రయించాల్సి వస్తుందని మండల ప్రజలు అంటున్నారు. ప్రతి మూడు వేల మందికి ఒక ఏఎన్ఎం ఉండాల్సి ఉన్నా, మండలంలో 45వేల మంది ప్రజలకు 15మంది ఏఎన్ఎంలు ఉండాలి కాని 9మంది మాత్రమే ఉన్నారు. ఉన్నాతాధికారులు స్పందించి అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



గతంలో బయటి రోగుల సంఖ్య 400కు పైగా వచ్చే వారు. ఆస్పత్రి అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగించి భవనం, మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకువచ్చారు. పరిశుభ్రతను పాటించారు. కొత్త మంచాలు, బెడ్లను వేశారు. కాన్పులు నెలకు 25కు పైగానే చేసేవారు. కాని గత పిబ్రవరిలో నలుగురికి మాత్రమే ప్రసవం చేశారు. కావునా, పూర్తిస్థాయిలో వైద్యులను, స్టాఫ్ నర్సులను నియమించాలి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– ఎంపీపీ డి.వసంత వెంకట్, మోమిన్‌పేట

ఎమ్మార్పీఎస్ సదస్సు వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

కొడంగల్: నియోజకవర్గంలోని మద్దూరు ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండ అశోక్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సు వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25వ తేదీన కొడంగల్ నియోజకవర్గంలో వికారాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయా లని కోరారు. ఏబీసీడీ వర్గీకరణ లక్ష్యంగా పని చేయాలన్నారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లా ల్లోని అన్ని గ్రామాల్లో గ్రామ కమిటీలు, మండల కమిటీలు, నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్క ర్ సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణ, ప్రవీణ్, పా న్నయ్య, రాజు, నరేష్, చిన్నయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

భారత్‌జోడో యాత్ర కోఆర్డినేటర్‌గా శ్రీశైలం

బంట్వారం: భారత్ జోడో యాత్ర నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా కోట్‌పల్లి మండలం జిన్నారానికి చెందిన శ్రీశైలం నియమితులయ్యారు. చాలా కాలంగా సోషలిష్ట్ పార్టీలో పని చేస్తూ రైతులు ,కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో శ్రీశైలం సేవలను గుర్తించిన స్పీకర్, శాసన సభ వ్యవహారాలు ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో మంగళవారం నగరంలోని గాంధీ భవన్‌లో నియామక పత్రం అందదుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు మరింతగా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తానని చెప్పా రు. తనకు ఈ పదవి అప్పగించిన శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతగిరి: ఎలక్టోరల్(ఎన్నికల)బాండ్ల పూర్తి వివరాలు ఎన్నికల కమిషన్‌కు మార్చి 13 వరకు సమర్పించాలని సుప్రీంకోర్టు ఎస్‌బీఐని ఆదేశించినా బీజేపీ ఒత్తిడితో ఇప్పటివరకు సుప్రీంకోర్టుకు సమర్పించకపోవడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో వికారాబాద్ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ .. నరేంద్రమోడీ ఒత్తిడి వల్ల ఎస్‌బీఐ సంస్థ ఇలాంటి డొంక పని చేస్తుందని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా 2018 నుంచి ఇప్పటివరకు ఎవరెవరు, ఏఏ రాజకీయ పార్టీలకు ఎంత విరాళాలు ఇచ్చారో వెంటనే ప్రకటించాలన్నారు. ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బయట పెడితే ఎవరెంత లబ్ధి పొందారో ప్రజలకు తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సుదర్శన్, మంగమ్మ, జోగు లాలయ్య, అనసూయ, రేణుక, వెంకటమ్మ, పద్మమ్మ, సుక్కమ్మ, లక్ష్మి, సంతోష, అన సూయ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

టెంకాయల వేలం వాయిదా

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల పరిధిలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన టెంకాయల వేలం పాటలో ఆశించిన ధర లభించకపోవడంతో వేలా న్ని ఈనెల 18కి వాయిదా వేస్తున్నట్లు ఆలయ ఈఓ సుధాకర్ ప్రకటించారు. 11రోజుల పాటు జరిగే ఆ లయ బ్రహ్మోత్సవాల కోసం పాట నిర్వహించాల్సి ఉండగా ఆశించిన మేర ప్రజలు ముందుకు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నర్సమ్మ రాములు, వేలంపాట పర్యవేక్షకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అర్చకులు పాండుశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తాండూరు: తాండూరు పట్టణంలోని మల్‌రెడ్డిపల్లి ప్రాంతంలో వెలసిన పాండురంగస్వామి దేవాలయ వార్షికోత్సవం ఆలయ ధర్మకర్తలు మెడిశెట్టి చంద్రకళ, జగన్నాథం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి లక్ష పుష్పార్చన, హోమం, మధ్యాహ్నం 12 గంటలకు పాండురంగస్వామి కల్యాణం, పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, మాజీ చైర్‌పర్సన్‌లు సునితసంపత్, కొట్రికె విజయలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్‌లు సాహు శ్రీలత, నీరజాబాల్‌రెడ్డి, శోభారాణి ,ప్రభాకర్‌గౌడ్‌లు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఉత్సవాలను తిలకించారు.

అండర్ బ్రిడ్జి నిర్మించాలని ఆందోళన

తాండూరు: పాత తాండూరు రైల్వే బ్రిడ్జి వద్ద మంగళవారం జరుగుతున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను స్థానికులు అడ్డుకున్నారు. 5 ఏళ్లుగా రైల్వేగేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పి, ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే పనులు ఆపాలని డిమాండ్ చేశారు. సోమవారం పనులకు శంకుస్థాపన చేసి ఎన్నికల కోసం బ్రిడ్జి పేరుతో డ్రామాలు ఆడుతున్నారని స్థానికులు ప్రజాప్రతినిధులపై మండిపడ్డారు.

చదవాలంటే... నడవాల్సిందే



తిమ్మారెడ్డిపల్లి నుంచి గోకఫసల్‌వాద్ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

రోజూ ఐదారు కిలోమీటర్లు నడుస్తున్న విద్యార్థులు

- సమయానికి రాని ఆర్టీసీ బస్సులు
- చదువుపై ఆశక్తి చూపని విద్యార్థులు

దౌల్తాబాద్: పేద విద్యార్థులకు మెరుగైన విద్య, మౌలిక వసతులను అందిస్తున్నామని పాలకులు పదే పదే ఊదరగొట్టుతున్నా.. విద్యార్థుల సమస్యల పరిష్కరించడంలో విఫలమవుతున్నారని విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోయినా.. కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు సరైన బస్సు సౌకర్యం లేక కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం 5 కిలోమీటర్లు నడిస్తే కాని పాఠశాల చేరుకోలేని దుస్థితి. ఈ కారణంగా విద్యార్థులు అలిసిపోయి చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నత విద్యకు ఇతర గ్రామాలకు..

మండలంలో 8 ఉన్నత, 8 ప్రాథమికోన్నత, 45 ప్రాథమిక పాఠశాలు ఉన్నాయి. ఇందులో 4వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నత, ప్రాథమికోన్నత విద్యను అభ్యసించడానికి ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇందులో దౌల్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 400కు పైగా విద్యార్థులు ఉన్నారు. దౌల్తాబాద్‌కు చెందిన వారు 150 మంది ఉండగా మిగిలిన విద్యార్థులు చుట్టూ పక్కల గ్రామాల నుంచి 5 కిలోమీటర్ల దూరం నుంచి రోజు నడుచుకొని వస్తున్నారు. అలాగే, గోకఫసల్‌వాద్ ఉన్నత పాఠశాలకు తిమ్మారెడ్డిపలి నుంచి 3 కిలోమీటర్ల దూరం నుంచి నడుచుకుని వస్తున్నారు. బాలంపేట ఉన్నత పాఠశాలకు సుల్తాన్‌పూర్, అంతారం, గుండేపల్లి, నాగసార్ గ్రామాల నుంచి 4 కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్నారు. కుదురుమళ్ల ఉన్నత పాఠశాలకు సంగాయిపల్లి, ఇందాపూర్, యాంకి గ్రామాల నుంచి వస్తున్నారు.

ఒక్కో చోట ఒక్కో పరిస్థితి..

మండలంలో ఆయా గ్రామాలకు బస్సుల్లో విద్యార్థులు ప్రయాణించడానికి బస్సు పాసులున్నాయి. అయితే, బస్సులు సమయానికి రావడం లేదంటున్నారు. మరో నాలుగు రోజుల్లో ఒంటిపూట బడులు ప్రారంభమవుతున్నాయి. దీంతో ఎండల్లోనే కాలినడకనే ఇళ్లకు చేరుకోవాల్సి ఉంటుంది. ఎర్రటి ఎండలో విద్యార్థులు కాలినడకన 5–6 కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

స్వచ్ఛంద సంస్థ సేవలు మరువలేనివి

వైస్ ఎంపీపీ మల్లేశం



బ్యాగులు పంపిణీ చేసిన సభ్యులు

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు మరువలేనివని వైస్ ఎంపీపీ మల్లేశం అన్నారు. మంగళవారం మండలంలోని మోత్కుర్ ప్రాథమిక పాఠశాలలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాఠశాలలో చదువుకుంటున్న 150 మంది విద్యార్థులకు బ్యాగ్స్, డ్రాయింగ్ కిట్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిధిగా వైస్ ఎంపీపీ హాజరై విద్యార్థులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పేద విద్యార్థులను ఇన్ఫోసిస్ ఫౌండేషన్ గుర్తించి కిట్లను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్మన్ సుధామూర్తి, సంస్థ సభ్యులు వంశీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జైరాం, బీజేపీ మండల అధ్యక్షుడు అనంతయ్య, గ్రామ మాజీ ఉపసర్పంచ్ శ్రీకాంత్ రావు, గ్రామస్తులు మల్లేశ్, శశిధర్‌రెడ్డి, సుధాకర్, కృష్ణకాంత్, గోపాలకృష్ణ, లింగయ్య, యాదయ్య, శేఖర్ పాల్గొన్నారు.

గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- గ్రామ ప్రత్యేకాధికారి విజయేందర్
- రూ.15 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి, విజయేందర్ తదితరులు

తాండూరు రూరల్: గ్రామస్తులు, నాయకుల సహకారంతో అంతారం గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని గ్రామ ప్రత్యేకాధికారి, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంతారం గ్రామంలో రూ.15 లక్షల నిధులతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు .ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. గ్రామస్తుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్న పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, ఎంపీటీసీ శాంతు కుమార్, మాజీ సర్పంచు వడ్డె శేఖర్ ,పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్, పీఏసీఎస్ డైరక్టర్ పెండ్యా నర్సింలు నాయకులు కొస్గి ఆశన్న, జంగని మొగులప్ప, డప్పు రాజు, దావిడ్, విజయ్‌కుమార్, నర్సింలు, రజనీకాంత్, వడ్డె అనంతయ్యలు ఉన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తాండూరు: తాండూరు పట్టణంలోని బాలాజీ నర్సింగ్ హోంలో బుధవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన వ్యాపారి కల్వ సుధాకర్ భార్య కల్వ అనురాధ క్యాన్సర్ వ్యాధితో మరణించింది. తాండూరు ప్రాంతంలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు లేక బాధితులు ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో వ్యాపారి కల్వ సుధాకర్ ప్రతి ఏటా కల్వ అనురాధ స్మారకార్థం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం బాలాజీ హాస్పిటల్ అధినేత డాక్టర్.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగరానికి చెందిన ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు, వైద్య బృందం హాజరై ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

సిటీ కేబుల్ ఎండీ నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న సిటి కేబుల్ ఎండీ నర్సింహారెడ్డి

తాండూరు రూరల్: చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తోందని మాజీ హోంమంత్రి సబితారెడ్డి సోదరుడు, సిటీ కేబుల్ ఎండీ నర్సింహారెడ్డి (బాబు) అన్నారు. మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఉన్నత శిఖరాలు అధిరోహించిన వ్యక్తులు.. ప్రభుత్వ పాఠశాల్లో చదివిన వారేనని గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు వచ్చిన ఎట్టి పరిస్థితుల్లో చదువు ఆపోద్దని విద్యార్థులకు సూచించారు. మల్కాపూర్ పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, పాఠశాల హెచ్ఎం నాగప్ప, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ అల్లావుద్దీన్, నాయకులు వీవీరెడ్డి, వడ్డె శ్రీను, పండరి, వెంకట్రాంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్లేశంలు ఉన్నారు.

మరోసారి మోదీనే ప్రధాని



సభకు బయలుదేరుతున్న బీజేపీ శ్రేణులు

కుల్కచర్ల: ఎంపీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించనున్నదని బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యులు మైపాల్, మండల అధ్యక్షుడు జెమిని సురేష్‌లు అన్నారు. మంగళవారం కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో నగరంలోని ఎల్బీస్టేడియంలో అమిత్‌షా పాల్గొనే కార్యకర్తల బహిరంగ సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరోకమారు మోదీ ప్రధాని కానున్నారని అందుకు అందరూ మోడీ నాయకత్వాన్ని బలపరుస్తూ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి సంగెం శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మైపాల్, స్థానిక నాయకులు ప్రవీణ్, మారుతి, తిరుమల వెంకటేశ్, మహేశ్, అంజనేయులు, కొండగోపాల్, రాజశేఖర్ గౌడ్, రాజయ్య, ధనుంజయ్, పోశయ్య, నరేష్, బీరయ్య, మొగులయ్య, శివ పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్‌తో వెళ్తే కఠిన చర్యలు

కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి



ఓవర్‌లోడ్ లారీలను ఆర్టీఓ అధికారులకు అప్పగిస్తున్న విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్: ఓవర్‌లోడ్ లారీలపై కఠిన చర్యలు తప్పవని కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం వివిధ సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి సిమెంట్ ట్యాంకర్లలో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నాయి. గమనించిన ఎస్ఐ తన సిబ్బందితో కలిసి ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీలను నిలిపి వేశాడు. ఒక్కో సిమెంట్ ట్యాంకర్‌లో 10 టన్నుల సిమెంట్ అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఆర్టీఓ అధికారులకు ఓవర్‌లోడ్ లారీలను అప్పగించారు. కేసు నమోదు చేసుకొని ఫైన్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



దౌల్తాబాద్: ఉపాధ్యాయులతో విద్యార్థులు

దౌల్తాబాద్: మండలంలోని మాటూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వయం పాలన దినోత్సవాన్ని జరిపారు. హెచ్ఎంగా శ్రీనివాస, ఎంఈఓగా మహేశ్, ఉపాధ్యాయులుగా చైతన్య, అజయ్, విజయ్ తదితరులు వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధన చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం భీమప్ప, ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీలత, తేజస్విని తదితరులున్నారు.



కుల్కచర్ల: ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

చెల్లాపూర్ పాఠశాలలో..

కుల్కచర్ల: మండలంలోని చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి సహచర విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించి అనుభూతిని పొందారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవుల, ఉపాధ్యాయులు దస్తయ్య, గౌరీనాయుడు పాల్గొన్నారు.